క్లుప్తంగా

వృద్ధురాలికి వీల్‌చైర్ అందజేత



వీల్‌చైర్ అందిస్తున్న వాసుదేవనాయుడు

మాకవరపాలెం: గాయపడి నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలికి వైఎస్సార్ సీపీ నేత వాసుదేవనాయుడు మంగళవారం వీల్‌చైర్ అందజేశారు. ఏడాది క్రితం భీమబోయినపాలెం గ్రామానికి చెందిన కశింకోట చింతల్లి కాలికి గాయాలు కావడంతో నడవలేని స్థితిలో ఉంది. ఈమెకు ఏపీ ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్లి వరలక్ష్మి వీల్‌చైర్ సమకూర్చారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



మాట్లాడుతున్న ఎంఈవోలు సత్యనారాయణ, ప్రసాద్

కె.కోటపాడు: గ్రామాల్లో బడిఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉంటూ చదువుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో - 1, 2 సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం కె.కోటపాడులోని స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో మెరుగైన అభ్యసన ఫలితాలను సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు చైల్డ్ ఎనాలిసిస్ చేసి విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలన్నారు. 9వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌లో బైజ్యూస్ కంటెంట్‌ను వినియోగించేలా చూడాలన్నారు. సమావేశంలో సీఆర్పీ నాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

కె.కోటపాడు: మండలంలో ఆర్లి, ఆనందపురం, చౌడువాడ, ఆర్.వై.అగ్రహారం గ్రామాల్లో ఆరు వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.శచీదేవి తెలిపారు. ఈ నెల 27లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు స్వీకరణ, 29న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల్లో సేవాభావం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

లింక్‌రోడ్డు ఏర్పాటు చేయాలని ఆందోళన

రావికమతం: మాడుగుల, రావికమతం మండలాల పరిధిలో 30 గిరిజన గ్రామాలకు ఉపయోగకరమైన లింక్ రోడ్డును ఏర్పాటు చేయాలని కోరుతూ అజయ్‌పురం గ్రామ గిరిజనులు మంగళవారం ఆ గ్రామంలో ఆందోళన చేశారు. జెడ్.జోగింపేట నుంచి అజయ్‌పురం మీదుగా మాడుగుల మండలం చేతబందలు వరకు లింక్ రోడ్డు ఏర్పాటు చేస్తే, 30 గిరిజన గ్రామాలకు రహదారి అందుబాటులోకి వస్తుందన్నారు. వర్షాకాలంలో ఇక్కడి ప్రజలకు ఆరోగ్యం బాగు లేకుంటే డోలీ మోతలు దిక్కవుతున్నాయని, ఈ రహదారి నిర్మిస్తే ఆ వెతలు తప్పుతాయన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చర్యలు తీసుకోవాలని గిరిజన నాయకులు పాంగి చంద్రయ్య, గంగరాజు, పెద్దా సూరిబాబు, విజయ్‌కుమార్ కోరారు.

రెండు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టరు సేవలు




కొత్త అగ్రహారంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు: మండలంలోని కొత్త అగ్రహారం, వారాడ గ్రామాల్లో మంగళవారం ఫ్యామిలీ డాక్టరు సేవలు నిర్వహించారు. కొత్త అగ్రహారంలో 69 మంది రోగులను చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం, వారాడలో 87 మందిని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ఆరోగ్య సూచనలు ఇచ్చారు. ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కె.కోటపాడు: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.శచీదేవి తెలిపారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుందన్నారు. ఎంపీటీసీ, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

కుండపోత వర్షం



వడ్డాదిలో డైవర్షన్ రోడ్డు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షం నీరు

గొలుగొండ: మండలంలో మంగళవారం ఉదయం నుంచి కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం వర్షం అధికంగా కావడంతో పొలాలు నీటితో నిండిపోయాయి. దారకొండపై భారీగా వర్షం కురవడంతో దారగెడ్డ, బొడ్డేరు, బోరింగ్ గెడ్డల నుంచి వర్షం నీరు ప్రవహించింది. దీని వల్ల దారకొండ దిగువన నాలుగు వేల ఎకరాల్లో నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం గెడ్డల నుంచి ప్రవహిస్తున్న వర్షంనీరు తాండవ జలాశయంలోకి చేరుతోంది.

బుచ్చెయ్యపేటలో జోరువాన

బుచ్చెయ్యపేట: మండలంలో జోరువాన కురిసింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు జల్లులతో కూడిన కూడిన వర్షం కురిసింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షం వల్ల ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలకు అవస్థలు పడ్డారు. పొలాలతోపాటు లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరింది. వడ్డాది పెద్దేరు నదిపై కట్టిన డైవర్షన్ రోడ్డును ఆనుకుని వర్షం నీరు ప్రవహించింది. పలు గ్రామాల్లో చెరువులు, బావుల్లోకి చేరుతోంది. ఈ వర్షం ఖరీఫ్ వరి నాట్లుకు, దమ్ములకు మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో పొలం పనుల్లో నిమగ్నమయ్యారు.

నాతవరంలో రోడ్లపై చేరిన వర్షపు నీరు

నాతవరం: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. నాతవరం మెయిన్ రోడ్డుపై వర్షం నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాండవ జంక్షన్ మర్రిపాలెం, ములగపూడి, మన్యపురట్ల తాండవ ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డుపై అధికంగా నీరు పారింది. సాయంత్రం 6 గంటలు సమయంలో అధికారులు సేకరించిన లెక్కల ప్రకారం 58 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. ఈ వర్షంతో ఖరీఫ్ సాగు కోసం వేసిన వరి నారుముడులకు ఎంతో ఉపయోగం ఉంటుందని రైతులు చెబుతున్నారు. చెరువులు, తాండవ రిజర్వాయరులో నీటి మట్టం పెరుగుతుందని ఇరిగేషన్ అధికారులు ఆశిస్తున్నారు.

పట్టణంలో కుండపోత వర్షం

నర్సీపట్నం: పట్టణంలో భారీ వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జల్లులతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రానికి భారీ వర్షంగా మారింది. రాత్రి 8 గంటల వరకు కురుస్తూనే ఉంది. కురిసిన కుండపోత వర్షానికి పట్టణ ప్రధాన డ్రైనేజీల్లో మురుగునీరు రోడ్లపై ఏరులై పారింది. అబిద్‌సెంటర్ వద్ద మెయిన్ రోడ్డు వర్షపు నీటితో చెరువును తలపించింది. ఆర్టీసీ కాంప్లెక్స్, శారదానగర్ ప్రాంతాల్లో వర్షపు నీటితో డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. బొంతువీధి ప్రాంతంలో వర్షపు నీరు భారీగా వచ్చి చేరడంతో డ్రైనేజీల్లో నీరు ఇళ్లలోకి వచ్చింది. కురిసిన వర్షానికి పట్టణం చిత్తడగా మారింది.



వర్షపునీటితో చెరువును తలపిస్తున్న అబిద్‌సెంటర్



గొలుగొండలో వర్షం నీటితో నిండిన పొలాలు



నాతవరం మెయిన్‌రోడ్డుపై వర్షపు నీటిలో వాహనాల రాకపోకలు

అర్హులందరికీ న్యాయం చేస్తాం

'గడపగడపకు' కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి



చీడిపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి



నాడు-నేడు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన బూడి

చీడికాడ: అర్హతను గుర్తించి నిరుపేదలకు న్యాయం చేసేందుకే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పని చేస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మంగళవారం చీడిపల్లి పంచాయతీలోని చీడిపల్లి, ఎస్.కొత్తూరు, నీలంపేట, వెల్లంకి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందజేశారు. ఈ క్రమంలో ప్రతి ఇంటా వృద్ధులు, మహిళలు చిరునవ్వుతో ఆహ్వానించి ఆనందం పంచుకున్నారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం మనది, అందుకే కులం, మతం, పార్టీ, ప్రాంతం, వర్గం అనే తేడా లేకుండా మన జగనన్న సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. నిరుపేదలకు సత్వర న్యాయం అందేలా చూడాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. రూ.1.68 కోట్లతో పంచాయతీలోని నాలుగు గ్రామాల్లో ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా పరిశీలించారు. ఎంపీపీ పాఠశాలలో నాడు-నేడు నుంచి రూ.18 లక్షలతో చేపట్టిన పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అక్కడ విద్యార్థులతో ముచ్చటించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. గర్భిణుల సీమంతాల్లో పాల్గొని దీవించారు. పిల్లలకు అన్నప్రాసన చేశారు. పలు సమస్యలను తక్షణమే పరిష్కరించారు. స్థలం ఉన్నవారికి ఇల్లు నిర్మించుకుంటామంటే మంజూరు చేయాలని ఆదేశించారు. సర్పంచ్ కసిరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ చీడికాడ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, నాయకులు ఈర్లె చైతన్య, లాలం వెంకునాయుడు, బర్ల అర్జునరావు, సూర్యనారాయణ, తహసీల్దార్ బి.వి.రాణి, ఎంపీడీవో జయప్రకాష్ పాల్గొన్నారు.

నేడు ఎల్.బి.పట్నంలో గడపగడపకు

ఎల్.బి.పట్నం పంచాయతీలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు మంగళవారం తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారని, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

పీడీ రాంబాబు సేవలు ప్రశంసనీయం

జిల్లా గురుకుల విద్యాలయాల జిల్లా కోఆర్డినేటర్ రూపావతి



పదవీ విరమణ చేసిన పీడీ రాంబాబును సత్కరిస్తున్న డీసీవో రూపావతి

దేవరాపల్లి: గ్రేడ్-1 ఫిజికల్ డైరెక్టర్‌గా బి. రాంబాబు అందించిన సేవలు ప్రశంసనీయమని విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల గురుకుల విద్యాలయాల సమన్వయకర్త ఎస్.రూపావతి తెలిపారు. మంగళవారం తెనుగుపూడి గురుకుల విద్యాలయంలో పీడీ రాంబాబు పదవీ విరమణ సన్మాన సభ ఘనంగా జరిగింది. అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుంచి గురుకుల ఉపాధ్యాయులు ఆయన్ను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. విధి నిర్వహణలో 33 ఏళ్ల పాటు అంకిత భావంతో పనిచేశారని డీసీవో సహా ఉపాధ్యాయులు కొనియాడారు. గురుకుల ప్రిన్సిపాల్ కె.వి.ఎల్. నర్సింహరావు, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం



మొక్కలు నాటుతున్న ఎంపీటీసీ చదల కృష్ణందొర

మాడుగుల రూరల్: నూతనంగా ఇటీవల నిర్మించిన రహదారికిరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అవురువాడ పంచాయతీ పరిధి శరభన్నపాలెం నుంచి పెదసారాడ వరకు ఇటీవల నిర్మించిన రోడ్డును డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రారంభించారు. దీనికి ఇరువైపులా ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు చదల కృష్ణందొర సారథ్యంలో మొక్కలను మంగళవారం నాటారు. రెండు కిలోమీటర్ల మేర బాదం, కానుగ, ఇతర మొక్కలు నాటారు. వార్డు సభ్యురాలు ముసలమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరువు గట్టుపై రింగు రోడ్డు నిర్మాణానికి ఆమోదం

ఏ. కొత్తపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ



కొత్తపల్లిలో ప్రజామోదం పొందినట్లు చెబుతున్న ఎంపీడీవో సుబ్బలక్ష్మి

దేవరాపల్లి: ఏ. కొత్తపల్లిలో అక్కమ్మ చెరువు గట్టుపై ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రజామోదం తెలిపారు. ఈ మేరకు హైకోర్టు డైరెక్షన్ మేరకు కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో ఇక్కడ భారీ పోలీస్ బందోబస్తు మధ్య మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా చెరువు గట్టుపై రోడ్డు నిర్మాణానికి 173 మంది అనుకూలంగాను, 13 మంది వ్యతిరేకంగాను తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ తీర్మానాన్ని కలెక్టర్ ద్వారా హైకోర్టుకు సమర్పిస్తామని ఎంపీడీవో ప్రకటించారు.

గతంలో కోర్టుకెళ్లిన టీడీపీ వర్గీయులు

గ్రామ సచివాలయం నుంచి అక్కమ్మ చెరువు గట్టు మీదుగా అప్పయ్య స్వామి గుడి వరకు రూ.1.19 కోట్లతో చేపడుతున్న ఔటర్ రింగు రోడ్డు నిర్మాణ పనులతో భూములు కోల్పోతామని టీడీపీకి చెందిన కొంతమంది ఆయకట్టుదారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పనులను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ గతేడాది ఏప్రిల్ 17 స్టేటస్ కో ఇచ్చింది. ఈ నేపథ్యంలో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. అనకాపల్లి రూరల్ సీఐ ఎ.రవికుమార్, ఎస్‌ఐ డి. నాగేంద్ర సహా నలుగురు ఎస్‌ఐలు, 20 మంది సిబ్బందితో పోలీస్ బందోబస్తు నడుమ ప్రశాంతంగా జరిగింది. సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, ఉపసర్పంచ్ పండూరి సరువునాయుడు, పీఆర్ ఏఈ ఉమామహేశ్వరరావు, ఇంచార్జ్ ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, స్థానిక పంచాయితీ సెక్రటరీ టి. పవన్‌కుమార్ తదితర్లు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమమే ధ్యేయం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ఇంటింటా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీ 17వ వార్డులో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు పార్టీ నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి వారి సంక్షేమంతోపాటు స్థానిక సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. సంక్షేమాన్ని తెలియజేయడంతోపాటు జనం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రూ.80 లక్షలతో అర్బన్ హెల్త్ సెంటర్‌ను నిర్మించి వార్డు ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రోడ్లు, డ్రైనేజీలు దశలవారీగా నిర్మిస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, పార్టీ వార్డు సీనియర్ నాయకులు గుడబండి నాగేశ్వరరావు, గవిరెడ్డి స్వామినాయుడు, మున్సిపల్ కమిషనర్ కనకారావు, ఆర్‌ఐ వెంకటలక్ష్మి, కౌన్సిర్లు బయపురెడ్డి చినబాబు, వీరమాచినేని జగదీశ్వరి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషాబేగం, అర్జున్, టౌన్ మహిళా విభాగం అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, వివిధ దేవస్థానాల చైర్మన్లు సిహెచ్.సత్యనారాయణ, ధనిమిరెడ్డి నాగు, శెట్టి చిన్న, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, పార్టీ నాయకులు అన్నపూర్ణ, లలిత, ఏఎంసీ డైరెక్టర్ లోకవరపు శారద పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

నర్సీపట్నం: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో భాగంగా ఏఐఎస్ఎఫ్ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలో ప్రైవేట్ విద్యా సంస్థలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో అధిక ఫీజులు వసూళ్లను అరికట్టాలన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు.

వడ్డాదిలో ఘనంగా మోదకొండమ్మ పండగ



అమ్మవారి ఆలయానికి ఘటాలతో వెళ్తున్న గ్రామస్తులు



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజరు పంచాయతీలో గ్రామదేవత మోదకొండమ్మ పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. జోరు వర్షం కురుస్తున్న డప్పులు, వాయిద్యాలు, నేలడాన్స్, మందుగుండు సామగ్రి కాల్చివేత మధ్యన అమ్మవారి ఘటాల ఊరేగింపు నిర్వహించారు. అమ్మలగన్న అమ్మ చల్లగా చూడమ్మా.. చల్లని నీ దీవెనలు అందించమ్మా.. ఈ ఏడాది వర్షాలు నమ్మగా కురవాలని, పాడిపంటలు బాగా పండాలని, కుటుంబ సభ్యులకు, పాడి పశువులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా దీవించమ్మా అంటూ అమ్మవారిని వేడుకున్నారు. వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణ మూర్తి, తదితర నాయకులు, అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పకడ్బందీగా ఇంటింటా ఓటరు సర్వే

దేవరాపల్లిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత తనిఖీ



మాధవనగరంలో సెల్ సిగ్నల్ సమస్యను తహసీల్దార్‌కు వివరిస్తున్న బీఎల్వోలు



కొండపాలెంలో ఇంటింటా తిరిగి సర్వే చేస్తున్న బీఎల్వోలు



దేవరాపల్లిలో ఇంటింటా ఓటరు సర్వేను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత

దేవరాపల్లి: ఇంటింటా ఓటరు సర్వేను పకడ్బందీగా చేపడుతున్నామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.డి. అనిత అన్నారు. దేవరాపల్లి పోలింగ్ స్టేషన్ నంబర్ 133లో ఇంటింటా ఓటరు సర్వేను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటరు జాబితా లో తప్పొప్పులను సరి చేసేందుకు వచ్చే నెల 21 వరకు ఈ సర్వే చేస్తామన్నారు. ఇందులో నిర్లక్ష్యం వహించకుండా, బీఎల్వోలు పారదర్శకంగా వ్యవహరించాలని ఆమె ఆదేశించారు. మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను ఎన్నికల కమిషన్ ఇచ్చిన యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఒకే గ్రామంలో ఒకే కుటుంబంలో వేర్వేరు చోట్ల ఉంటున్న కుటుంబ సభ్యుల ఓట్లను ఒకే డోర్ నంబర్‌కు కిందకు తీసుకువచ్చి ఒకే బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ ఎం. లక్ష్మి, వీఆర్వో లు జి. నూకరాజు, సిహెచ్. సూర్యనారాయణ పాల్గొన్నారు.

కలెక్టరు దృష్టికి సెల్ సిగ్నల్ సమస్య

నాతవరం: ఇంటింటా ఓటరు సర్వేలో భాగంగా సెల్ సిగ్నల్ సమస్యను కలెక్టరు కలెక్టరు దృష్టికి తీసుకెళ్లామని తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మాధవనగరం, నాతవరం గ్రామాల్లో మంగళవారం బీఎల్వోల సర్వేను ఆయన పరిశీలించారు. మండలంలో సగానికి పైగా గ్రామాల్లో సెల్ సిగ్నల్స్ లేక ఓటర్లు తప్పొప్పుల సరవణను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఇబ్బందిగా ఉందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సర్వే సకాలంలో చేసినప్పటికీ సిగ్నల్ సమస్య వల్ల ఓటర్ల సర్వే శాతం ఆన్‌లైన్‌లో తక్కువగా నమోదవుతోందని వాపోయారు. మండల వ్యాప్తంగా 65 పోలింగ్ కేంద్రాల పరిధిలో వచే నెల 21వ తేదీలోపు సర్వే పూర్తి చేయాలని తహసీల్దారు తెలిపారు.

చురుగ్గా ఓటరు సర్వే

రోలుగుంట: మండలంలో ఈ నెల 21న ప్రారంభమైన ఇంటింటా ఓటరు సర్వే చురుగ్గా సాగుతోంది. 43 పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ లెవల్ అధికారులు వారి పరిధిలో ఇళ్లకు తిరిగి 18 ఏళ్లు నిండిన వారివి, వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదైన కుటుంబాలవి, మరణాలు, వలసలు, చేర్పు మార్పులు, తదితర వివరాలను నమోదు చేసుకుంటున్నారు. దీనిలో భాగంగా కొండపాలెంలో పంచాయతీ కార్యదర్శి కె. ఆనందరావు, వీఆర్వో చెల్లయ్యమ్మ, వీఆర్ఏ పర్దేశి బృందంగా 29, 30 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన వార్డుల్లో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలను తహసీల్దార్ పర్యవేక్షించి బీఎల్వోలకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం



మణిదీప్‌ను సన్మానిస్తున్న సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం: సైబర్ నేరాలపై పెన్షనర్లు అప్రమత్తంగా ఉండాలని హెల్ప్ ఈజ్ ఇండియా డిజిటల్ ట్రెనింగ్ ప్రోగ్రాం స్టేట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మణిదీప్ సూచించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు ఆధ్వర్యంలో పట్టణంలో సీనియర్ సిటిజన్స్‌కు సైబర్ మోసాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మణిదీప్ మాట్లాడుతూ యాప్‌లు జోలికి అసలు పోవద్దన్నారు. సీనియర్ సిటిజన్స్ సంఘం సభ్యులు కె.వి.సుబ్బారావు, జి.కె.ఆర్. బాబు, రావణాపల్లి రిజర్వాయర్ మాజీ చైర్మన్ లాలం అప్పారావు, షిర్డీ సాయి మందిరం చైర్మన్ కర్రి రాంగోపాల్, సిటీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలకు భారం లేకుండా ఉచితంగా సర్టిఫికెట్లు

జగనన్న సురక్షలో డీపీవో శిరీషారాణి



బుచ్చెయ్యపేటలో సర్టిఫికెట్లు అందిస్తున్న డీపీఓ శిరీషారాణి



పొట్టిదొరపాలెంలో సర్టిఫికెట్లు అందిస్తున్న నాయకులు, అధికారులు

బుచ్చెయ్యపేట: జగనన్న సురక్షతో ప్రజలకెంతో మేలు కలుగుతోందని డీపీవో శిరీషారాణి తెలిపారు. మంగళవారం బుచ్చెయ్యపేట సభలో ఆమె మాట్లాడుతూ ప్రజలకు భారం లేకుండా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పైసా ఖర్చు లేకుండా 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. సర్పంచ్ సుంకరి సూరిబాబు మరణంతో ప్రతి నెలా జీతాలు అందడం లేదని పంచాయతీ స్వీపర్లు వాపోయారు. దీనిపై పంచాయతీ సెక్రటరీ నాగేశ్వరరావు కల్పించుకుని ఉప సర్పంచ్‌కు చెక్ పవర్ వచ్చిందని డీపీవోకు వివరించారు. బుచ్చెయ్యపేటలో 764 మందికి డీపీవో, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సుంకరి శ్రీను, మాజీ సర్పంచ్ సుంకరి గాంధీ, తహసీల్దార్ వెంకటేశ్వరరావు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. పొట్టిదొరపాలెంలో 1,340 మందికి సర్టిఫికెట్లను ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, సర్పంచ్ దరిమిశెట్టి యశోద అప్పలనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మోటూరి చిన్నంనాయుడు అందించారు. మాజీ సర్పంచ్ దరిమిశెట్టి రాజు, ఉప సర్పంచ్ గుద్దేటి శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

మాడుగుల రూరల్: ఒమ్మలి జగన్నాథపురం (వి.జె.పురం) గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ గూడెపు రాధాకృష్ణ, లక్ష్మి దంపతులు దాతృత్వంతో మంగళవారం స్థానిక ఎంపీపీ పాఠశాలలో 55 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. రాధాకృష్ణ తల్లిదండ్రులు పెదకన్నాపాత్రుడు, నారాయణమ్మ జ్ఞాపకార్థంగా వీటిని అందించారు. హెచ్‌ఎం దొర, సర్పంచ్ చామంతుల మణి, ఎంపీటీసీ గూడెపు సత్యవతి, మాజీ సర్పంచ్ గూడెపు హరికృష్ణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బంటు సత్తిబాబు పాల్గొన్నారు.

ఒక్కరికే రెండు ఆధార్ కార్డులు.. నిలిచిన రేషన్

నాతవరం: వల్సంపేటకు చెందిన రెడ్డి రమణమ్మకు రెండు ఆధార్ కార్డులు రావడంతో ఏడు నెలలుగా నిత్యావసర సరుకులు నిలిచిపోయాయి. తొలుత ఆధార్ కార్డు 93458565470పై ఉపాధి హామీ పథకంలో వేలిముద్రలు నమోదు కాలేదని, మీసేవకు వెళ్లి సరి చేసుకోవాలని అధికారులు సూచించారు. అక్కడ 391114440029 నంబరుతో మరొక్క ఆధార్ ఇచ్చారు. ఆమె భర్త సత్తిబాబు వేలిముద్రతో రేషన్ తీసుకునేది. ఏడు నెలల క్రితం అతను చనిపోవడంతో అప్పటి నుంచి రమణమ్మ రేషన్ పొందలేకపోతోంది. ఈ విషయంపై తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడును వివరణ కోరగా ఆధార్ నంబర్లు సరిచేసేందుకు సంబంధిత సెక్షన్ సిబ్బందితో మాట్లాడానన్నారు.